క్లుప్తంగా

వాలీబాల్ పోటీలు ప్రారంభం



పెబ్బేరు రూరల్: శ్రీ రామ నవమి సందర్భంగా మంగళవారం మండలంలోని తిప్పాయిపల్లిలో ఏర్పాటు చేసిన వాలీబాల్ పోటీలను ఎమ్మెల్యే తూడి మేఘారెడ్డి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పోటీలను స్నేహ పూర్వకంగా ఆడాలని, గెలుపు ఓటములకు సమానంగా తీసుకోవాలని క్రీడాకారులకు సూచించారు.

సంకిరెడ్డిపల్లిలో సుందరకాండ పూజలు



కొత్తకోట రూరల్: మండలంలోని సంకిరెడ్డిపల్లి వీరాంజనేయస్వామి ఆలయంలో గ్రామ పెద్దలు మూళమళ్ల రాఘవరెడ్డి, పుష్పలత దంపతుల ఆధ్వర్యంలో సుందరకాండ పూజలు తొమ్మిరోజులుగా నిర్వహిస్తున్నారు. గ్రామంలో జరుగుతున్న పూజా కార్యక్రమాల ద్వారా పండుగ వాతావరణం నెలకొంది. శ్రీరామ నవమి సందర్భంగా నేడు మధ్యాహ్నం సీతారాముల కల్యాణోత్సవం ఉంటుందని, భక్తులకు అన్నదానం కార్యక్రమం ఉంటుందని నిర్వాహకులు తెలిపారు.

ఘనంగా ఆగాదావూద్ గంధోత్సవం



పాన్‌గల్: మండల కేంద్రంలోని ఖిల్లా దుర్గంపై వెలిసిన హజ్రత్ ఆగాదావూద్ గంధోత్సవం మంగళవారం ఘనంగా నిర్వహించారు. గ్రామానికి చెందిన జీఎం జమీల్ ఆధ్వర్యంలో దర్గా వద్ద ప్రత్యేక పూజలు (ఫాతిహా) నిర్వహించారు. ఈ కార్యక్రమానికి భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు. గంధోత్సవం సందర్భంగా భక్తులకు అన్నదానం చేశారు. కార్యక్రమంలో రాముయాదవ్, మహబూబ్, గౌస్, చోటు, బాలరాజు, రాములు, వేణు, ఖాదర్, సాధిక్ తదితరులు పాల్గొన్నారు.

కోదండరామస్వామి ఉత్సవాలు



పెబ్బేరు రూరల్: వనపర్తి మండలంలోని పెద్దగూడెం కోదండరామస్వామి ఉత్సవాలు కొనసాగుతున్నాయి. మంగళవారం ఆలయంలో నిత్యహోమం నిర్వహించారు. ఉత్సవ విగ్రహాలను ఆలయం నుంచి ఆంజనేయస్వామి దేవాలయం వరకు ఊరేగింపు నిర్వహించి పూజలు చేశారు. ప్రభ (చిన్నరథం)కు భక్తులు పూజలు నిర్వహించి కొబ్బరి కాయలు కొట్టి ఆలయం నుంచి గ్రామంలోకి భక్తులు రథాన్ని లాగారు. అనంతరం భక్తులకు తీర్థప్రసాదాలు అందించారు. బుధవారం రథోత్సవం ఉంటుందని నిర్వాహకులు తెలిపారు.

సాయి ఆలయంలో పూజలు

ఆత్మకూర్: శ్రీసాయిబాబ మందిరంలో మంగళవారం వార్షికోత్సవం సందర్భంగా భక్తి శ్రద్ధలతో ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆత్మకూర్‌లో సాయిబాబ ఆలయం ప్రారంభించి 24 ఏళ్లు పూర్తి చేసుకుని 25వ వసంతంలోకి అడుగుపెడుతున్న సందర్భంగా ప్రత్యేక పూజలు చేపట్టినట్లు ఆలయ కార్యదర్శి దివాన్జీ ప్రభాకర్‌రావు తెలిపారు. ఈసందర్భంగా దివంగత మాజీ ఎమ్మెల్యే దయాకర్‌రెడ్డి కృషి ఫలితంగానే ఆత్మకూర్‌లో అద్భుతమైన ఆలయం నిర్మాణం జరిగిందని, ఇప్పటి వరకు లక్షల్లో భక్తులు సందర్శించారని పేర్కొన్నారు. మాజీఎమ్మెల్యే సీతాదయాకర్‌రెడ్డితో పాటు కుమారులు సిద్దార్థరెడ్డి, కార్తీక్‌రెడ్డి, నాయకులు జగదాభిరాంరెడ్డి ప్రత్యేక పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో నాయకులు బాలక్రిష్టారెడ్డి, ఎస్టీడీ శ్రీను, గాలిపంపు శ్రీను, వెంకటేష్, తిరుపతి, ఇమ్రాన్, కుమార్, భక్తులు తదితరులు పాల్గొన్నారు.



తాగునీటి సమస్య పరిష్కరిస్తాం

- అందుబాటులో ఉన్న వనరులు సద్వినియోగం చేసుకోవాలి
- అధికారులు క్షేత్రస్థాయిలో పర్యటించాలి
- విద్యతోనే సమాజంలో గుర్తింపు
- జెడ్పీ చైర్మన్ లోక్‌నాథ్‌రెడ్డి



మాట్లాడుతున్న జెడ్పీ చైర్మన్ లోక్‌నాథ్‌రెడ్డి

పాన్‌గల్: వేసవి కాలం దృష్ట్యా గ్రామాల్లో తాగునీటి ఎద్దడి నివారించేందుకు అధిక ప్రాధాన్యత ఇస్తూ ప్రజల ఇబ్బందులు తొలగించాలని జెడ్పీ చైర్మన్ లోక్‌నాథ్‌రెడ్డి అధికారులకు సూచించారు. మంగళవారం మండల కేంద్రంలోని ఎంపీడీఓ కార్యాలయంలో ఎంపీపీ మామిళ్లపల్లి శ్రీధర్‌రెడ్డి అధ్యక్షతన నిర్వహించిన మండల సర్వసభ్య సమావేశానికి ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. గ్రామాల్లో తాగునీటి సమస్య నెలకొందని, అందుకు ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేసుకోవాలన్నారు. అందుకు అనుగుణంగా బోర్లు, పైపులైన్ల లీకేజీలకు మరమ్మతులు చేపట్టడం, వ్యవసాయ బోర్లను లీజుకు తీసుకోవడం, నూతన బోర్లను వేయడం ద్వారా తాగునీటి ఎద్దడిని నివారించేందుకు చర్యలు తీసుకోవాలని అధికారులకు సూచించారు. అధికారులు క్షేత్రస్థాయిలో పర్యటించి గ్రామాల్లో నెలకొన్న సమస్యలపై నివేదికలను అందజేస్తే దానికి అనుగుణంగా నిధుల మంజూరు చేస్తామని హామీ ఇచ్చారు. అందుబాటులో ఉన్న వనరులను సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

ప్రజారోగ్యంపై దృష్టి

ప్రజా ఆరోగ్యంపై దృష్టి సారించి తాగునీరు, పారిశుద్ధ్యం వంటి సమస్యలు తలెత్తకుండా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. విద్య, వైద్యం వంటి వాటికి కేంద్రం, రాష్ట్ర ప్రభుత్వాలు అనేక నిధులు ఖర్చు చేస్తున్నాయన్నారు. గ్రామాల్లో చేపట్టే అభివృద్ధి పనులకు అందరి ఏకాభిప్రాయంతో తీర్మానాలు రూపొందించాలన్నారు. దీంతో పాటు ఉపాధి హామీ పథకంలో చేపట్టే పనులు ప్రజా మద్దతు, రైతులకు ఉపయోగపడే పనులతో పాటు సాగునీటి కాల్వల మరమ్మతులకు ప్రాధాన్యత ఇవ్వాలని సూచించారు.

స్వయం సమృద్ధి సాధించాలి

యువత ఎక్కువగా ప్రభుత్వ ఉద్యోగాల కోసం ఎదురు చూడకుండా స్వయం ఉపాధి అవకాశాలను సద్వినియోగం చేసుకునేలా అధికారులు వారిని ప్రోత్సహించాలన్నారు. వ్యవసాయం, పాడి పరిశ్రమ వంటి పథకాలపై అవగాహన పెంచి ఆయా రంగాలల్లో యువతను ప్రోత్సహించాలన్నారు. చదువుతోనే సమాజంలో మంచి గుర్తింపు, గౌరవం పెరుగుతుందన్నారు. జిల్లాను అన్ని రంగాల్లో అభివృద్ధి చేసేలా ప్రణాళికలను సిద్ధం చేస్తున్నారని తెలిపారు. అధికారులు, ప్రజాప్రతినిధులు కలిసికట్టుగా, సమన్వయంతో పనిచేస్తేనే గ్రామ సమస్యలు పరిష్కరించబడుతాయని ఎంపీపీ మామిళ్లపల్లి శ్రీధర్‌రెడ్డి అన్నారు. రాజకీయాలకు అతీతంగా సంక్షేమ పథకాలు అర్హులైన పేదవారికి చేరేలా అధికారులు తమ వంతు పాత్ర పోషించాలని కోరారు. రైతులకు ఇబ్బందులు కలుగకుండా గ్రామాలల్లో వరి కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేయాలన్నారు. అంతకుముందు మండల స్థాయి అధికారులు తమ శాఖల పనితీరును వివరించారు. సమావేశంలో జెడ్పీటీసీ లక్ష్మి, వైస్ ఎంపీపీ కవిత, ఎంపీడీఓ కోటేశ్వర్, ఎంపీఓ రఘురాములు, డీటీ అశోక్‌నాయుడు తదితరులు పాల్గొన్నారు.

ప్రజా చైతన్య కెరటం గద్దర్



గద్దర్ స్మారక సంచికను విడుదల చేస్తున్న ప్రముఖులు

పెబ్బేరు రూరల్: ప్రజా చైతన్య కెరటం గద్దర్ అని ప్రముఖ వైద్యుడు డా.ఎల్ మురళీధర్ అన్నారు. మంగళవారం వనపర్తి జిల్లా కేంద్రంలో సాహితీ కళా వేదిక ఆధ్వర్యంలో ప్రజా వాగేయకారుడు స్వర్గీయ గద్దర్ స్మారక సంచిక, పాట మార్చ్ పుస్తక పరిచయ సభ నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ఆయన పాల్గొని మాట్లాడారు. గద్దర్ తన జీవిత కాలమంతా ప్రజా సమస్యలపై పాటను ఆయుధంగా చేసుకొని పోరాడారని, ప్రజల్లో చైతన్యం రగిలించారన్నారు. దాదాపు 170 మంది కవులు, రచయితలు గద్దర్ ఉద్యమ జీవితాన్ని, వ్యక్తిత్వాన్ని వ్యాసాలు, కవితలు, పాటల రూపంలో ఒక సంచిక వెలుపరచడం అభినందనీయమని పేర్కొన్నారు. కార్యక్రమంలో సాహితీ కళా వేదిక జిల్లా అధ్యక్షుడు శంకర్‌గౌడ్, వ్యాఖ్యాత బైరోజు చంద్రశేఖర్, వనపర్తి బార్ అసోసియేషన్ అధ్యక్షుడు మోహన్‌కుమార్ యాదవ్, ఆర్‌డీఎస్ సంస్థ నిర్వాహకురాలు చిన్నమ్మథామస్, ప్రముఖులు కందూరు నారాయణరెడ్డి, బండారు శ్రీనివాస్, మల్యాల బాలస్వామి, గంధం నాగరాజు, బత్తుల శ్రీనివాసులు, రాజారాం ప్రకాష్, ఖమ్మర్‌రహ్మాన్, సత్తార్, డా.నరేష్ కుమార్, తిరుమలేష్ తదితరులు పాల్గొన్నారు.

ఆశీర్వదించండి.. సేవకుడిగా పనిచేస్తా



కొత్తకోటలో మాట్లాడుతున్న చల్లా వంశీచందర్‌రెడ్డి, చిత్రంలో ఎమ్మెల్యే జి.మధుసూదన్‌రెడ్డి

- కాంగ్రెస్‌పార్టీ మహబూబ్‌నగర్ ఎంపీ అభ్యర్థి చల్లా వంశీచంద్‌రెడ్డి

కొత్తకోట రూరల్: ఆశీర్వదించి పార్లమెంట్‌కు పంపిస్తే ఐదేళ్ల పాటు సేవకుడిగా పనిచేస్తానని కాంగ్రెస్ పార్టీ మహబూబ్‌నగర్ ఎంపీ అభ్యర్థి చల్లా వంశీచందర్‌రెడ్డి అన్నారు. మంగళవారం కొత్తకోటలోని ఓ గార్డెన్స్‌లో దేవరకద్ర ఎమ్మెల్యే జి.మధుసూదన్‌రెడ్డి ఆధ్వర్యంలో నిర్వహించిన కొత్తకోట, మదనాపురం మండలాల సన్నాహక సమావేశంలో పాల్గొని మాట్లాడారు. రాహుల్‌గాంధీని ప్రధానిని చేసేందుకు తనను భారీ మెజార్టీతో గెలిపించాలని.. ప్రతి కార్యకర్త, నాయకుడు కేవలం 25 రోజులు కష్టపడి పని చేయాలని కోరారు. ఈ నెల 19న నామినేషన్ దాఖలు కార్యక్రమానికి సీఎం రేవంత్‌రెడ్డి హాజరవుతారని, పార్లమెంట్ నియోజకవర్గంలోని కార్యకర్తలు, నాయకులు పెద్దఎత్తున తరలిరావాలన్నారు. అనంతరం ఎమ్మెల్యే జి.మధుసూదన్‌రెడ్డి మాట్లాడుతూ.. కాంగ్రెస్ ప్రభుత్వం చేస్తున్న అభివృద్ధిని చూసి వివిధ పార్టీల నాయకులు, కార్యకర్తలు పెద్ద ఎత్తున పార్టీలో చేరుతున్నారన్నారు. కాంగ్రెస్‌పార్టీని దెబ్బతీసేందుకు బీజేపీ, బీఆర్‌ఎస్ కుట్రలు చేస్తున్నాయని తిప్పికొట్టాలని పిలుపునిచ్చారు. టీపీసీసీ కార్యనిర్వాహక కార్యదర్శి అరవింద్‌రెడ్డి, టీపీసీసీ ఎస్సీసెల్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు పి.ప్రశాంత్, జిల్లా ప్రధానకార్యదర్శులు బోయేజ్, పి.కృష్ణారెడ్డి, రైతు సంఘం జిల్లా అధ్యక్షుడు శ్రీనివాస్‌రెడ్డి, పట్టణ అధ్యక్షులు మేస్త్రీ శ్రీనివాసులు, సత్యారెడ్డి, శేఖర్ రెడ్డి, జెడ్పీటీసీ మాజీ సభ్యులు డా. పీజే బాబు, మాసన్న, మండల అధ్యక్షుడు బీచుపల్లి యాదవ్, ఎల్లంపల్లి నరేందర్‌రెడ్డి, గొల్లబాబు, సాక బాలనారాయణ, మిషేక్ తదితరులు పాల్గొన్నారు.

ఓట్ల కోసమే మత రాజకీయాలు..

ఆత్మకూర్: అభివృద్ధిని విస్మరించి దేశం కోసం.. ధర్మం కోసం అంటూ మత రాజకీయాలు చేస్తున్న వారికి ఓటు ద్వారా బుద్ధి చెప్పాలని కాంగ్రెస్‌పార్టీ ఎంపీ అభ్యర్థి చల్లా వంశీచందర్‌రెడ్డి కోరారు. మంగళవారం రాత్రి పట్టణంలోని ఓ ఫంక్షన్‌హాల్‌లో మక్తల్ ఎమ్మెల్యే వాకిటి శ్రీహరి ఆధ్వర్యంలో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ప్రజలకు నిస్వార్థంగా సేవ చేయాలన్న లక్ష్యంతో బరిలో ఉన్న తనను గెలిపించాలని కోరారు. బీజేపీ, బీఆర్‌ఎస్ కుమ్మక్కు అయ్యాయని.. కుట్రలు, కుతంత్రాలకు డీకే అరుణ నిదర్శమని, తమ్ముడి కోసం సొంతపార్టీ అభ్యర్థి జలంధర్‌రెడ్డిని వెన్నుపోటు పొడిచారని ఆరోపించారు. ఈ సందర్భంగా బీజేపీ, బీఆర్‌ఎస్ పార్టీలకు చెందిన సుమారు 500 మంది నాయకులు, కార్యకర్తలు కాంగ్రెస్‌పార్టీలో చేరారు. కార్యక్రమంలో రాష్ట్ర గీతకార్మిక సంఘం చైర్మన్ కేశం నాగరాజుగౌడ్, రాష్ట్ర నాయకులు ప్రశాంత్ కుమార్‌రెడ్డి, మాదిరెడ్డి జలంధర్‌రెడ్డి, విష్ణువర్ధన్ రెడ్డి, పోలీస్ చంద్రశేఖర్‌రెడ్డి, మండల నాయకులు గంగాధర్‌గౌడ్, రహ్మతుల్లా, తులసిరాజ్‌యాదవ్, పరమేష్, నల్గొండ శ్రీను పాల్గొన్నారు.

దళితవాడలను బాగు చేయండి



మున్సిపల్ చైర్మన్‌ను సన్మానిస్తున్న జీటీ శ్యామ్

వనపర్తి టౌన్: జిల్లా కేంద్రంలోని దళితవాడలను అభివృద్ధి చేసేందుకు మున్సిపాలిటీ తరఫున తగిన చొరవ చూపాలని హ్యూమన్ రైట్స్ ఆర్గనైజేషన్ రాష్ట్ర కార్యదర్శి జీటీ శ్యామ్ మున్సిపల్ చైర్మన్ పుట్టపాకల మహేష్‌ను కోరారు. మహేష్ నూతనంగా మున్సిపల్ చైర్మన్‌గా ఎన్నిక కావడంతో మంగళవారం పుర కార్యాలయంలో దళితవాడ సమస్యల గురించి చర్చించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. గత ప్రభుత్వాల హయాంలో ఆశించిన స్థాయిలో దళిత కాలనీలు అభివృద్ధికి నోచుకోలేదని వాపోయారు. సౌకర్యాలు, వసతులు, కల్పించే అవకాశాలు ఉన్నా.. పాలకులు పెద్దగా పట్టించుకోకపోవడంతో దళిత కాలనీలు నిర్లక్ష్యానికి గురయ్యాయని వివరించారు. సుమారు 10 నుంచి 15వేల పైచిలుకు దళిత జనాభా ఉంటారని, ఆ జనాభాకు అనుగుణంగా ప్రస్తుత పరిస్థితులకు తగట్టుగా పారిశుద్ధ్య సేవలు, తాగునీటి వసతి, డ్రెయినేజీ సదుపాయం, శిథిలమైన డ్రెయినేజీ మరమ్మతు, అవసరమైన ప్రాంతాలకు సీసీ రోడ్ల ఏర్పాటు చేయడం వంటి చర్యలపై తగిన దృష్టి కేంద్రీకరించాలని కోరారు. అనంతరం చైర్మన్ పుట్టపాకల మహేష్‌ను సన్మానించారు. కార్యక్రమంలో జిల్లా అధ్యక్షుడు విశ్వం బాబు, కార్యదర్శి ఆంజనేయులు తదితరులు పాల్గొన్నారు.

23న మ్యాథ్స్ టాలెంట్ టెస్ట్

అమరచింత: పట్టణంలోని శ్రీసరస్వతి శిశుమందిరం పాఠశాలలో వందేమాతరం ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఈనెల 23న 4 నుంచి 8వ తరగతులు చదువుతున్న విద్యార్థులకు మ్యాథ్స్ టాలెంట్ టెస్ట్ నిర్వహిస్తున్నట్లు కోఆర్డినేటర్ బాలకృష్ణ తెలిపారు. టాలెంట్ టెస్ట్‌లో మొదటి బహుమతిగా సైకిల్, రెండో బహుమతిగా సెమీ సమ్మర్ క్యాంపు అడ్మిషన్ ఉచితంగా ఉంటుందన్నారు. సెమి సమ్మర్ క్యాంప్‌లో పాల్గొనాలి అనుకున్న విద్యార్థులు తమ పేర్లను నమోదు చేసుకోవాలని సూచించారు. ఆసక్తి గల వారు సెల్ 86399 66829 కు సంప్రదించాలని కోరారు.

ఉపాధి కూలీలకు ఓఆర్‌ఎస్ ప్యాకెట్ల పంపిణీ

కొత్తకోట రూరల్: పెద్దమందడి మండలంలోని స్కూల్‌తండా గ్రామ శివారులో జరుగుతున్న ఉపాధి హామీ పనులను ఎంపీఓ శ్రీరాంరెడ్డి పరిశీలించారు. అనంతరం కూలీలతో మాట్లాడి సమస్యలు అడిగి తెలుసుకున్నారు. వేసవి ఎండల తీవ్రత ఎక్కువగా ఉండటంతో కూలీలకు ఓఆర్‌ఎస్ ప్యాకెట్లను పంపిణీ చేశారు. అనంతరం గట్లఖానాపూర్‌లోని నర్సరీని సందర్శించి మొక్కలను పరిశీలించారు. మొక్కలు ఎండిపోకుండా రెండు పూటల నీళ్లు పట్టాలని నిర్వాహకులకు సూచించారు.

విద్యార్థులు గమ్యం దిశగా పయనించాలి



విద్యార్థులతో లెక్చరర్లు, కళాశాల యాజమాన్యం

కొత్తకోట: పట్టణంలోని నివేదిత డిగ్రీ కళాశాలలో ప్రథమ, ద్వితీయ సంవత్సరం చదువుతున్న విద్యార్థులచే అధ్యాపక బృందం, కళాశాల యాజమాన్యం వీడ్కోలు సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన విద్యార్థులు చేసిన సాంస్కృతిక కార్యక్రమాలు పలువురిని ఆకట్టుకున్నాయి. అనంతరం ఒకటో, మూడో, ఐదో సెమిస్టార్‌లో మంచి ఫలితాలు సాధించిన విద్యార్థులకు ప్రథమ, ద్వితీయ బహుమతులను అందజేశారు. ఈ సందర్భంగా పలువురు లెక్చరర్లు మాట్లాడుతూ కష్టపడి చదివితే ఉన్నత లక్ష్యాలను చేరుకోవచ్చన్నారు. కళాశాల చదువు అనంతరం చెడు వ్యసనాలకు గురికాకుండా ఇతర పోటీ పరీక్షలకు సన్నద్ధం కావాలని విద్యార్థులకు సూచించారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ పి సహదేవుడు, కళాశాల యాజమాన్యం ఎస్.గోవర్ధన్‌గౌడ్, సి.రమేష్, పి.సూరిబాబుగౌడ్, లెక్చరర్లు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

కాంగ్రెస్‌తోనే అభివృద్ధి సాధ్యం



పెబ్బేరు రూరల్: నాగర్‌కర్నూల్ పార్లమెంట్ కాంగ్రెస్ అభ్యర్థి మల్లు రవి మంగళవారం ఉదయం పెబ్బేరు పట్టణ కేంద్రంలోని పీజేపీ క్యాంపులో మార్నింగ్ వాకర్స్‌ను కలిసి కాంగ్రెస్‌కు మద్దతుగా నిలబడాలని కోరారు. ఈ సందర్భంగా పార్లమెంట్ అభ్యర్థి మల్లు రవి మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీ మాట ఇచ్చిందంటే తప్పకుండా హామీలు అమలు చేస్తుందన్నారు. ఇప్పటికే ఆరు గ్యారెంటీలను అమలు చేస్తున్నామని, మిగతా హామీలు కూడా త్వరలోనే ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి అమలు చేస్తారని తెలిపారు. నాగర్‌కర్నూల్ పార్లమెంట్ నియోజకవర్గం అభివృద్ధి చెందాలంటే హస్తం గుర్తుకు ఓటు వేసి భారీ మెజార్టీతో గెలిపించాలని కోరారు.

ప్రధాని నరేంద్రమోదీతోనే సంక్షేమ ఫలాలు



ప్రచారం చేస్తున్న బీజేపీ నాయకులు

ఖిల్లాఘనపురం: ప్రధాన మంత్రి నరేంద్రమోదీతోనే దేశాభివృద్ధి సాధ్యమని బీజేపీ వనపర్తి అసెంబ్లీ ఇన్‌చార్జ్ కండె ప్రసాద్ అన్నారు. మంగళవారం మండలంలోని మానాజీపేటలో మండల అధ్యక్షుడు నవీన్‌రెడ్డి, మండల కన్వీనర్ బుచ్చిబాబుగౌడ్ ఆధ్వర్యంలో బీజేపీ నాగర్‌కర్నూల్ పార్లమెంట్ అభ్యర్థి భరత్‌ప్రసాద్‌ను గెలిపించాలని కోరుతూ బీజేపీ మండల నాయకులు ఇంటింటి ప్రచారం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా హాజరైన ఆయన మాట్లాడుతూ నరేంద్రమోదీ పదేళ్ల పాలనలో ఎలాంటి అవినీతి, అక్రమాలు చోటు చేసుకోలేదన్నారు. మహిళలకు ఉజ్వల యోజన పథకం ద్వారా ఉచితంగా సిలిండర్లు అందిచినట్లు తెలిపారు. 500 ఏళ్ల నుండి దేశప్రజలంతా నిరీక్షించిన అయోధ్యలో భవ్యరామ మందిరం నిర్మాణం పూర్తి చేశామని పేర్కొన్నారు. కార్యక్రమంలో అసెంబ్లీ కన్వీనర్ శ్రీనివాసులుగౌడు, మండల ఇన్‌చార్జ్ సీతారాములు, కిసాన్‌మోర్చా జిల్లా ఉపాధ్యక్షుడు రాంరెడ్డి, విక్రం, రవినాయక్, మండల ప్రధాన కార్యదర్శి శివశంకర్, సత్యనారాయణ, రాంచందర్, శాంతమ్మ, ఆశన్న, ఈదమ్మ, వెంకటరమణ, చక్రవర్తి, గోపాల్‌రెడ్డి, దశరథ్, రమేష్ తదితరులు పాల్గొన్నారు.

హామీల అమలు ఏమైంది?

పెబ్బేరు రూరల్: ఎమ్మెల్యే తూడి మేఘారెడ్డి గతంలో పెబ్బేరు మున్సిపల్ సమావేశంలో సంత స్థలంపై ఇచ్చిన మాట ఇంత వరకు నెరవేర్చకపోవడంపై ప్రజలకు సమాధానం చెప్పాలని మున్సిపల్ పాలకవర్గం కోరారు. మంగళవారం స్థానిక ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో వారు మాట్లాడుతూ 30.19 గుంటల సంత స్థలంపై ఏకగ్రీవంగా మున్సిపల్ తీర్మాణం చేసి ఇస్తే ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి ఆ స్థలం సంతకు దక్కేట్లు చేస్తానని ఎమ్మెల్యే చెప్పారని, దీనికి సంబంధించి తీర్మానం చేసి వారికి అందజేసి మూడు నెలలు అవుతున్నా స్పందన లేదని అసహనం వ్యక్తం చేశారు. ఎన్నికలు వచ్చినప్పుడల్లా కాంగ్రెస్ నాయకులకు సంత స్థలం గుర్తుకు వస్తుందని ఎద్దేవా చేశారు. సంత స్థలం అడ్డం పెట్టుకొని ఓట్లు అడిగే కన్నా అభివృద్ధి చేసి ఓట్లు అడుగాలని హితువు పలికారు. మాజీ మంత్రి నిరంజన్‌రెడ్డి పెబ్బేరు మున్సిపాలిటీకి నిదులు కేటాయించి ఎంతో అభివృద్ధి చేశారని గుర్తుచేశారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్‌పర్సన్ ఎద్దుల కరుణశ్రీ, వైస్ చైర్మన్ కర్రెస్వామి, కౌన్సిలర్లు పార్వతమ్మ, బీఆర్‌ఎస్ మండల, పట్టణ అధ్యక్షులు వనం రాములు, దిలీప్‌రెడ్డి, ఎద్దుల సాయినాథ్, ఎల్లయ్య ఉన్నారు.



శ్రీరామనవమికి ఆలయాలు ముస్తాబు



గోవర్ధనగిరిలో సీతారాముల కల్యాణానికి ముస్తాబైన ఆలయం



జిల్లా కేంద్రంలో..

వనపర్తి టౌన్: శ్రీరామనవమి వేడుకల సందర్భంగా సీతారాముల కల్యాణ మహోత్సవానికి జిల్లా కేంద్రంతో పాటుగా జిల్లా వ్యాప్తంగా పలు దేవాలయాలు, మండపాలు ముస్తాబయ్యాయి. వనపర్తిలోని రామాలయం, వేంకటేశ్వర స్వామి ఆలయం, గోపాల్‌పేట రోడ్డులోని రామాంజనేయ ఆలయాలు ప్రత్యేక ఆకర్షణ నిలిచాయి. బుధవారం జరిగే స్వామివారి కల్యాణం వీక్షించేందుకు వేలాది మంది భక్తజనులకు ఇబ్బందులు కలగకుండా చలువ పందిళ్లు, పెండల్స్‌కు మామిడి తోరణలు కట్టి ముస్తాబు చేస్తున్నారు. దీనికి తోడుగా ఆలయాలు విద్యుత్ కాంతులతో అందంగా ఆలకరించారు. సీతారాముల కల్యాణాన్ని ముత్యాల తలంబ్రాలతో నిర్వహించనున్నారు. పలువురు భక్తులు ఆయా ఆలయాలకు పట్టు వస్త్రాలు, ముత్యాల తలంబ్రాలు ఊరేగింపుగా తీసుకొచ్చి ఇవ్వడం వనపర్తిలో అనవాయితీ వస్తోంది.

అమరచింత: పట్టణంలోని రామాలయంలో బుధవారం నిర్వహించే సీతారామస్వామి కల్యాణ మహోత్సవ కార్యక్రమానికి సంబంధించిన ఏర్పాట్లను ఆలయ కమిటీ సభ్యులు సిద్ధం చేశారు. ఆలయ ఆవరణలో షామియానాలతో పాటు మండపంలో కల్యాణ కట్ట, హోమశాలను ఏర్పాటు చేసినట్లు ఆయల కమిటీ సభ్యులు తెలిపారు. బుధవారం ఉదయం ఆరు గంటలకు సుప్రభాతం, ఉదయం ఎనిమిది గంటలకు అభిషేకం, మధ్యాహ్నం 12:15 నిమిషాలకు కల్యాణ మహోత్సవం అనంతరం అన్నదానం నిర్వహిస్తున్నామన్నారు. సాయంత్రం ఆరు గంటలకు రథోత్సవం ఉంటుందన్నారు.

వీపనగండ్ల: శ్రీరామనవమి పర్వదినాన్ని పురస్కరించుకొని మండల కేంద్రంతోపాటు గోవర్ధనగిరి, సంగినేనిపల్లి, వీపనగండ్ల, కల్వరాల తదితర గ్రామాల్లో దేవాలయాలలో సీతారాముల కల్యాణానికి అవసరమైన ఏర్పాట్లు పూర్తి చేశామని ఆలయాల కల్యాణ ఉత్సవ కమిటీ సభ్యులు తెలిపారు.

‘ఉపాధ్యాయులు తీరు మార్చుకోవాలి’



ఆశ్రమ పాఠశాలలో హెచ్‌ఎం, ఉపాధ్యాయులతో మాట్లాడుతున్న ఎంపీపీ కృష్ణానాయక్

ఖిల్లాఘనపురం: ఎస్టీ ఆశ్రమ పాఠశాలలో విధులు నిర్వహిస్తున్న ఉపాధ్యాయులు పద్ధతి మార్చుకొని విద్యార్థులకు నాణ్యమైన విద్య అందించాలని ఎంపీపీ కృష్ణానాయక్ అన్నారు. పాఠశాలలో కొన్ని రోజులుగా హెచ్‌ఎం, కొందరు ఉపాధ్యాయుల మధ్య తగాదాలు జరుగుతున్నాయి. ఈ విషయమై విద్యార్థులను ఇరువురు కూడా గ్రూపులుగా మార్చి ఎవరైనా అధికారులు, ప్రజాప్రతినిధులు వస్తే తమ వైపు మాట్లాడాలి అన్నట్లు తయారు చేసుకున్నారు. ఇలా జరుగుతుండటంతో పాఠశాలలో రోజుకు ఓ రకంగా గొడవ జరుగుతూనే ఉంది. మంగళవారం విద్యార్థి సంఘం నాయకులు శివతో పాటుగా కొంత మంది సంఘం నాయకులు పాఠశాల వద్దకు వచ్చి విద్యార్థులతో సమస్యలు తెలుసుకున్నారు. పాఠశాలలో జరుగుతున్న పరిస్థితులు తెలుసుకుని ఎంపీపీ కృష్ణానాయక్ పాఠశాలకు వచ్చారు. ఈ సందర్భంగా పాఠశాలలో ఉన్న హెచ్‌ఎం, ఉపాధ్యాయులను పిలుచుకుని మాట్లాడారు. జిల్లాలోనే ఉన్న ఏకైక ఎస్టీ ఆశ్రమ పాఠశాలలో నిరుపేద కుటుంబాలకు చెందిన గిరిజన విద్యార్థులకు విద్యాబుద్ధులు నేర్పకుండా ఈ గొడవలు ఏమిటని ప్రశ్నించారు. ప్రభుత్వం మీకు జీతాలు ఇచ్చేది గొడవలు పెట్టుకోవడానికి కాదని గట్టిగా హెచ్చరించారు. విద్యార్థుల జీవితాలతో ఆటలాడుకోవాలని చూస్తే ఇక్కడ చూస్తు ఊరుకోమన్నారు. ఎవరి విధులు వారు నిర్వర్తించకుండా గొడవలు చేయడం మండిపడ్డారు. పరీక్షలు పూర్తి అయిన తరువాత విషయాన్ని ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్తామన్నారు. మీరంతా సెలవుల్లో మీకు నచ్చిన పాఠశాలలకు బదిలీపై వెళ్లేందుకు ఏర్పాట్లు చేసుకోవాలని సూచించారు. అలా కాండా ఇక్కడే ఉండి విద్యార్థులను ఇబ్బంది పెడితే చర్యలు కఠినంగా ఉంటాయన్నారు.

క్రమం తప్పకుండా మందులు వాడాలి



అవగాహన కల్పిస్తున్న వైద్య సిబ్బంది

పాన్‌గల్: వైద్యుల సూచనలు పాటిస్తూ క్రమం తప్పకుండా మందులు వాడితే క్షయ వ్యాధి నయమవుతుందని వైద్య సిబ్బంది రాంచందర్, శ్రీలక్ష్మి అన్నారు. మంగళవారం మండలంలోని కేతేపల్లిలో క్షయ నిర్ధారణ క్యాంపు నిర్వహించి, వ్యాధి నివారణపై అవగాహన కల్పించారు. అనంతరం అనుమానితుల నుంచి తెమడను సేకరించినట్లు వారు పేర్కొన్నారు. పది రోజులకు మించి జ్వరం రావడం, రెండు వారాలకు మించి దగ్గు, రాత్రి వేళల్లో చెమటలు పట్టడం, స్వల్ప కాలంలో బరువు తగ్గడం తదితర లక్షణాలు ఉంటే క్షయ వ్యాధి అనుమానితులుగా గుర్తించి తెమడ పరీక్ష సిబినాయట్, ట్రూనాయట్ పరీక్షలు, ఎక్సరే పరీక్షలు చేయించుకోవాలన్నారు. వ్యాధి నిర్ధారణ అయిన వారు బలవర్ధకమైన ఆహారం తీసుకోవడానికి ప్రభుత్వం నిక్షయ్ పోషణ్ యోజన పథకం ద్వారా మందులు వాడినని రోజులు నెలకు రూ.500 అందించనున్నట్లు వారు పేర్కొన్నారు.

ఆర్టీసీ డ్రైవర్, కండక్టర్‌పై దాడి చేసిన ముగ్గురిపై కేసు నమోదు

పెబ్బేరు రూరల్: ఆర్టీసీ డ్రైవర్, కండక్టర్లను కొట్టిన ఘటనలో మంగళవారం ముగ్గురిపై కేసు నమోదు చేశామని వనపర్తి రూరల్ ఎస్‌ఐ జలంధర్‌రెడ్డి తెలిపారు. ఆయన తెలిపిన వివరాల ప్రకారం.. వనపర్తి మండలంలోని అంకూరుకు చెందిన రామిరెడ్డి, రవి, శంకర్ అనే ముగ్గురు వ్యక్తులు బైక్‌పై వచ్చి చిట్యాల తూర్పుతండా వద్ద వనపర్తి నుంచి మహబూబ్‌నగర్ వెళ్తున్న ఆర్టీసీ బస్సును ఆపి బస్సు డ్రైవర్ నాగేష్‌ను దుర్భాషలాడుతూ సైడ్ ఇవ్వవా అని కొట్టారు. దీంతో కండక్టర్ బాలకృష్ణారెడ్డి అడ్డగించడంతో ఆయనపై కూడా చేయి చేసుకున్నారు. ప్రయాణికులు వచ్చి డ్రైవర్, కండక్టర్‌ను విడిపించారు. ఈ ఘటనపై కండక్టర్ బాలకృష్ణారెడ్డి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశామని ఎస్‌ఐ తెలిపారు.

అప్రమత్తతతో ప్రమాదాల నివారణ



ఆత్మకూర్: అగ్నిమాపక వారోత్సవాల్లో భాగంగా పట్టణంలోని జన్‌కో కాలనీలో మంగళవారం ఫైర్ సిబ్బంది విన్యాసాలు ప్రదర్శించారు. ప్రమాదం సంభవించినప్పుడు తీసుకోవాల్సిన జాగ్రత్తలపై విన్యాసాలతో క్లుప్తంగా వివరించారు. ఈ సందర్భంగా స్టేషన్ ఫైర్ ఆఫీసర్ శ్రీనివాసరావు మాట్లాడుతూ అగ్నిమాపక వారోత్సవాల్లో భాగంగా ప్రజలు ప్రమాదాల బారిన పడినప్పుడు తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించారు. ఈనెల 20వ తేదీ వరకు ప్రధాన కూడళ్లు, గ్రామాల్లో ప్రదర్శనలు నిర్వహించి ప్రజలకు అవగాహన కల్పిస్తామన్నారు. అనంతరం వారోత్సవాల కరపత్రాలు పంపిణీ చేశారు. అగ్నిమాపక సిబ్బంది సంజీవరెడ్డి, రాముడు, సందీప్‌రెడ్డి, భానుచందర్‌రెడ్డి, వెంకటనర్సయ్య, మోహన్ తదితరులు పాల్గొన్నారు.